ఆరోగ్యానికి సెల్లు



సమస్యగా ఉందని చెబుతున్న మహిళలు

- ఇష్టానుసారం సెల్‌టవర్ల ఏర్పాటు
- నిబంధనల బేఖాతరు
- ప్రజల ఆందోళన

బలిజిపేట: సాంకేతిక అభివృద్ధి అవసరమైనప్పటికీ కొన్నింటి వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిని నియంత్రించాల్సిన వారు పట్టించుకోకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సాంకేతిక విప్లవంలో మొబైల్ ఫోన్ల రాకతో సమాచార మార్పిడి వ్యవస్థను చేతివేళ్లతో ఆడిస్తున్నాం. నేడు సెల్‌ఫోన్లు నిత్యావసర వస్తువుగా మారిపోయాయి. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ దర్శనమిస్తోంది. అవసరాలకు ఫోన్ ఎంతగానో ఉపయోగం. దీని వినియోగం శృతిమించడంతో కొన్ని ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. వాటి వినియోగం ఎక్కువవడంతో సిగ్నల్స్ అందించే టవర్ల వల్ల విపరీతమైన రేడియేషన్ ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. జనావాసాల మధ్య టవర్లు ఏర్పాటు చేయడం దారుణంగా ఉంది. వాటినుంచి విడుదలయ్యే అధిక రేడియేషన్ కారణంగా ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ఇప్పటికే నిపుణులు చెబుతున్నారు.

● ప్రభుత్వ ఉత్తర్వులు తప్పనిసరి

గ్రామీణ ప్రాంతాల్లో సెల్‌టవర్ల ఏర్పాటుకు గ్రామ పంచాయతీ, పట్టణాల్లో అయితే టౌన్ ప్లానింగ్ అధికారుల నివేదిక అనుగుణంగా అనుమతులు ఇస్తారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అనుమతులు లేనిదే సెల్‌టవర్ ఏర్పాటుకు వీలుపడదు. స్థానిక అధికారులు కంపెనీ ప్రతినిధులతో చేతులు కలిపి అవసరానికి మించి సెల్‌టవర్ల ఏర్పాటుకు అనుమతిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

● రెండు కిలోమీటర్ల పరిధిలోనే పదిటవర్లు

మండల కేంద్రమైన బలిజిపేటకు రెండు కిలోమీటర్ల పరిధిలో బలిజిపేట, వెంగాపురం, తుమరాడ, చిలకలపల్లి గ్రామాల్లో వివిధ రకాల కంపెనీలకు చెందిన సుమారు 10టవర్లు కనిపిస్తున్నాయి. ప్రజలు నివసించే ప్రదేశాలు, మార్కెట్ ప్రాంతాల్లో మొబైల్ ఫోన్ల వినియోగం అధికంగా ఉండే అవకాశం ఉండడంతో వినియోగదారులకు అంతరాయం లేని సేవలు అందించడానికి ఎక్కువ టవర్లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఎక్కువ మంది ఉండే ప్రాంతాల్లో ఎక్కువ రేడియేషన్ ఉండే ప్రమాదం లేకపోలేదు. నివాస గృహాల మధ్యలో ఉండే టవర్ల వల్ల సమీప ప్రాంతంలో ఉండే ప్రజలు తీవ్ర సమస్యలకు గురవుతున్నారు. రేడియేషన్ ప్రభావం, వాటి శబ్దాలవల్ల రాత్రి, పగలు తేడా లేకుండా అసౌకర్యం ఎక్కువగా ఉంటోందని వాపోతున్నారు. వాటిని నియంత్రించాలని కోరుతున్నారు.



బలిజిపేటలో నివాసగృహాల మధ్య ఏర్పాటు చేసిన సెల్‌టవర్

● ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

సెల్‌టవర్ల ఏర్పాటులో నిబంధనలు అనుసరించాల్సి ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కేస్తున్నారు. పాఠశాల భవనాలపై, నివాస గృహాల మధ్య ఏర్పాటుచేయడం చట్టవిరుద్ధం. భూమి కంపించినా, గాలితో కూడిన వర్షం వచ్చినప్పుడు సెల్‌టవర్లు కూలితే పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తినష్టం ఏర్పడుతుంది. పట్టణాలలో, గ్రామాల్లో నివాస గృహాల మధ్య ఒకే టవర్‌పై వివిధ కంపెనీలకు చెందిన పరికరాలు అమర్చడం, సిగ్నల్స్ చాలకపోయినా, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలనే దృక్పథంతో కెపాసిటీని పెంచడం వంటి పరిణామాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బలిజిపేటలో కొందరు మహిళలు దీనిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇష్టానుసారం ఏర్పాటు



సెల్ టవర్లను ఇష్టానుసారం ఏర్పాటుచేయడంతో అనారోగ్య పరిస్థితులు ఎదురవుతున్నాయి. నివాసగృహాల మధ్యలో టవర్లు ఉండడం, వాటి రేడియేషన్లు పెంచడంతో వాటి శబ్దాలకు పక్కన ఉండలేకపోతున్నాం. ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. వాటిని నియంత్రించాలి.

– టి.పుష్పలత, గృహిణి, బలిజిపేట

క్లుప్తంగా

పనుల పరిశీలన



మాట్లాడుతున్న ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఉపాధిహామీ పథకం నిధులతో జరిగిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు కాశీపేట స్వర్గధామానికి వెళ్లే రహదారిలో నిర్మించిన కల్వర్టు, 88 మీటర్ల అప్పలనాయుడు చెరువు సమీపంలో నిర్మించిన 128 మీటర్ల సీసీ రోడ్డు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులతో మంజూరు చేసిన పనులు అర్థాంతరంగా నిలిచిపోయినవి వెంటనే పూర్తి చేయాలని సూచించారు. మండలానికి మరో 80 గోకులం షెడ్‌లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ సహాయకుడు, డిజిటల్ సహాయకుడు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ శశికుమార్

పార్వతీపురంటౌన్: రహదారి భద్రతా నియమాలు పాటించాలని ఎంవీఐ శశికుమార్ అన్నారు. రహదారి భద్రతా మసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆర్టీసీ డ్రైవర్‌లు, ఆటోడ్రైవర్లతో జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చే ప్రోత్సాహక లబ్ధికి జిల్లాలోని ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు నడిపే ప్రతి ఒక్క డ్రైవర్ ఈ-శర్మ పోర్టల్‌లో తమ పేరు, ఇతర వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడపరాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ కూడా వాహనం నడపరాదన్నారు. ప్రతి 6 మాసాలకు ఒకసారి కంటి, ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని డ్రైవర్లకు సూచించారు. గుడ్ సమరటిన్, గోల్డెన్ హవర్ గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా అనుమానితులు మాదక ద్రవ్యాలను బస్సులలో రవాణా చేస్తే వారిని గుర్తించి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంవీఐ జి.సత్యనారాయణ, మెడికల్ ఆఫీసర్ డా. పి. నారాయణరావు, ఆర్టీసీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్‌లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి



గిరిజనులతో ముచ్చటిస్తున్న ఎస్సై సంతోషి

పార్వతీపురం రూరల్: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్సై సంతోషి అన్నారు. ఈ మేరకు మండలంలోని ఒడిశా బోర్డర్‌లో గల లోవవలస గ్రామాన్ని ఆమె సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు సైబర్ నేరాలపై, టోల్‌ఫ్రీ నంబర్లపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అపరిచితుల నుంచి బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన ఓటీపీలను ఎట్టి పరిస్థితుల్లో చెప్పకూడదన్నారు. మహిళలు, విద్యార్థులకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం పలు చట్టాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఎక్కడైనా ఇబ్బంది కలిగితే టోల్‌ఫ్రీ నంబర్లను వినియోగించాలని సూచించారు. టోల్‌ఫ్రీ నంబర్ల ద్వారా పోలీసుల నుంచి కొద్ది సమయంలోనే రక్షణ కల్పించనున్నామన్నారు. కార్యక్రమంలో ఆమెతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అంబేడ్కర్ గురుకులం పాఠశాల పీఎస్ బొడ్డవలస ప్రిన్సిపాల్ ఆశీర్వాదం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 7వ తేదీనుంచి మార్చి 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో ఇంగ్లీషు మాధ్యమాల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థి ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, తెలుపు రేషన్ కార్డుతో పాటు సెల్‌ఫోన్ నంబర్ కలిగి ఉండాలని పేర్కొన్నారు.

ఐటీఐలో అప్రెంటిస్

సాలూరు రూరల్: సాలూరు ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళాను సోమవారం నిర్వహించినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కొట్ల శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో చదువుకుని ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నిర్వహించిన అప్రెంటిస్ మేళాలో 56 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అందులో 35 మందిని వివిధ సంస్థలు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 15 వ తేదీన చేరేవిధంగా పత్రాలను అందజేశారన్నారు. ఎంపికైన విద్యార్థులకు నెలకు స్టైపెండ్‌గా రూ.15వేలు,రూ.14వేలు,రూ.12,500 ఇవ్వనున్నట్లు చెప్పారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు సరికాదు

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురంటౌన్: స్పీకర్ అయ్యన్నపాత్రుడు గిరిజనులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు సరైనవి కాదని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఆయన తన స్వగృహంలో మీడియాతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి 1/70 చట్టం కారణంగా విఘాతం ఏర్పడుతుందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారని, అది గిరిజనులపై ఎంతో ప్రభావం చూపుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం పెట్టుబడుదారులు, కార్పొరేట్ కంపెనీలను ప్రోత్సహించేందుకే చట్టసవరణ చేసే దిశగా అడుగులు వేస్తున్నాయన్నారు. ఏజెన్సీ అటవీ ప్రాంతాన్ని అప్పగించడానికే 1/70 సవరణ చేపడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గిరిజన హక్కులను కాలరాసేందుకు పన్నాగం పన్నుతున్నారని ఆరోపించారు. గిరిజన సంఘాలు ఈనెల 12న నిర్వహించనున్న బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

సమన్వయంతోనే వ్యాధులను నిర్మూలిద్దాం

- డీఎంహెచ్ఓ భాస్కరరావు




మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు

సీతానగరం: వివిధ శాఖలలో విధులు నిర్వహిస్తున్న అధికారులు సమన్వయంతో పనిచేసినపుడే వ్యాధుల నివారణ సాధ్యమని డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు అన్నారు. ఈ మేరకు స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బోదకాలు నివారణ, నులిపురుగుల నివారణ మాత్రలు వేసే కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో విద్యార్థులకు ఒకేపర్యాయం అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో మాత్రలు వేస్తున్నట్లు తెలిపారు. అలాగే విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిరోధక మందులు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్కే పీఓ రఘు, పీహెచ్‌సీ డాక్టర్ పి.పావని, సీహెచ్ఓ ఎస్వీ రమణ, ఎంఈఓ జి. సూరిదేముడు, హెచ్‌ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నులిపురుగుల మాత్రలు వేసిన ఎంపీడీఓ

మక్కువ: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీకేంద్రాలు, కళాశాలల్లో 1నుంచి 19సంవత్సరాలలోపు చిన్నారులు, కిశోరీ బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించారు. ఈ మేరకు మక్కువ మండలంలోని సరాయివలస పంచాయతీ కొండబుచ్చమ్మపేట అంగన్వాడీకేంద్రంలోని చిన్నారులకు ఎంపీడీవో డీడీ స్వరూపరాణి నులిపురుగుల మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మిగిలిన పిల్లలకు ఈనెల 17వతేదీన మాప్‌అప్ రోజున మాత్రలు వేయించాలని సూచించారు.



చిన్నారికి నులిపురుగుల మాత్రను వేస్తున్న ఎంపీడీవో స్వరూపరాణి

ఉపాధిపనుల పరిశీలన

సరాయివలస పంచాయతీ కొండబుచ్చమ్మపేట గ్రామం సమీపంలోని ఉపాధిహామీపథకం ద్వారా జరుపుతున్న కాలువపనులను ఎంపీడీవో స్వరూపరాణి పరిశీలించారు. వేతనదారుల మస్టర్లను తనిఖీ చేశారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున పనిప్రదేశం వద్ద టెంట్‌లు ఏర్పాటు చేసుకోవాలని, మంచినీరు వెంట తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మన్యం బంద్ జయప్రదం చేయాలి

సాలూరు రూరల్: ఈ నెల 11,12 తేదీల్లో జరగనున్న మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ మామిడిపల్లి గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం సాలూరు మండల కమిటీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను సోమవారం గిరిజన సంఘం నాయకులు మర్రిమని, లక్ష్మయ్యలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70చట్టం సవరణ చేయాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతమైన స్థానంలో ఉండి గిరిజనులకు వారి జీవన విధానానికి రక్షణగా ఉన్న చట్టాలను సవరణ చేయాలనడం గిరిజనులను అవమానించడం తప్ప మరొకటి కాదన్నారు. గిరిజనుల చట్టాలను సక్రమంగా అమలు చేయాలని కోరారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ఆదివాసీ సంఘం నాయకులు

మన్యం బంద్‌ను విజయవంతం చేయండి

మక్కువ: ఈనెల 11,12వతేదీల్లో ఏజెన్సీ గిరిజన సంఘం చేపడుతున్న మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని రైతుకూలీసంఘం జిల్లాఅధ్యక్షుడు ఊయక ముత్యాలు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1/70చట్టం సవరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు టూరిజం సదస్సులో పెట్టుబడిదారుల ముందు వెల్లడించారన్నారు. 1/70 చట్టం రద్దుచేయకుండా ఉండడంతోపాటు, పీసా చట్టం, అటవీహక్కుల రక్షణచట్టం యథాప్రకారం అమలు చేయాలని కోరుతూ ఏజెన్సీ బంద్ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ బంద్‌కు రైతుకూలీ సంఘం సంపూర్ణ మద్దతు అందిస్తుందని చెప్పారు. అలాగే గిరిజనసంఘాలు, గిరిజనులు పెద్ద ఎత్తున బంద్‌లో పాల్గొనాలని కోరారు.

అందుబాటులో గుండె నొప్పి ఇంజక్షన్

సాలూరు రూరల్: సాలూరు ఏరియా ఆస్పత్రిలో మొదటి గోల్డెన్ అవర్‌లో గుండెనొప్పికి ఇంజక్షన్ ఉచితంగా అందుబాటులో ఉందని డాక్టర్ మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరికైనా ఛాతీలో నొప్పి, ఎడమ చేయి లాగడం, కళ్లు తిరిగి పడిపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే 108 వాహనానికి కాల్ చేస్తే దగ్గరలో ఉన్న సామాజిక ఆస్పత్రికి తరలిస్తారన్నారు. అక్కడ డాక్టర్లు పరీక్షించి అవసరమైతే గుండె నొప్పి ఇంజక్షన్ ఇస్తారని తెలిపారు.

రక్తహీనత నివారణే లక్ష్యం



బందలుప్పి పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి శ్రీకాంత్

పార్వతీపురం రూరల్: విద్యార్థులు, చిన్నారుల్లో రక్తహీనత నివారణే లక్ష్యంగా డీ వార్మింగ్‌డేను ప్రభుత్వం నిర్వహిస్తుందని బందలుప్పి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని బందలుప్పి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరం నుంచి 19 ఏళ్ల వయస్సుగల వారికి ఆల్బెండజోల్ మాత్రలను వేయనున్నట్లు తెలిపారు. మండలంలో 4,575 మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేయాలని లక్ష్యం నిర్ధారించామన్నారు. చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకునేలా అంగన్వాడీ, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలకు పలు సూచనలు చేశామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్‌ఎంకె తిరుమలప్రసాద్, ఎంపీహెచ్ ఈఓ బి. శ్రీరాములునాయుడు, ఆశవర్కర్లు, అంగన్వాడీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షా పే చర్చ

సీతానగరం: దేశంలో ఎక్కడికి వెళ్లాలన్నా హిందీ భాష అవసరం ఎంతైనా ఉందని ఎంఈఓ జి.సూరిదేముడు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల, బూర్జ ఉన్నత పాఠశాలల్లో హిందీ భాషపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి సోమవారం పరీక్ష నిర్వహించారు. ఈ మేరకు ఎంఈఓ-1 జి.సూరిదేముడు పరీక్షాపే చర్చ కార్యక్రమాన్ని పరిశీలిస్తే ప్రధానమంత్రి హిందీలో మాట్లాడుతున్న సారాంశాన్ని మళ్లీ హిందీ ఉపాధ్యాయులతో ఆవశ్యకత, హిందీ నేర్చుకోవడం వల్ల ఉపయోగాలు హిందీ నేర్చుకోవడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశం మొత్తం ఎక్కడైనా మనం అవలీలగా జీవించగలమన్న నమ్మకం కలిగిన విషయాలపై పిల్లలు అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. హిందీ భాషను అలవర్చుకునేందుకు విజ్ఞానాన్ని పెంపొందించడానికి ఎగ్జామ్స్‌లో తీసుకోవాలిస్న జాగ్రత్తల గురించి తెలియజేశారు. పదవ తరగతి ప్రీఫైనల్ ఎగ్జామ్స్‌ను కూడా పరిశీలించాచు.

పది విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీఈఓ తిరుపతినాయుడు



బలిజిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ ఎస్.తిరుపతినాయుడు

బలిజిపేట: రానున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని, మంచి ఫలితాలు వచ్చేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని పార్వతీపురం మన్యం జిల్లా డీఈఓ ఎస్.తిరుపతినాయుడు అన్నారు. ఈ మేరకు బలిజిపేట ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం పర్యవేక్షించారు. పదవ తరగతి విద్యార్థులు శ్రద్ధతో బాగా చదివి మంచి మార్కులు సాధించాలని పిలుపునిచ్చారు. మంచి చేతిరాత, పరీక్ష రాసే విధానంపై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా ఎవరికి ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని పరిష్కరించుకోవాలని చెప్పారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల తల్లితండ్రులతో ఉపాధ్యాయులు సయోధ్యతో ఉండి వారికి సహకరించాలన్నారు. ప్రత్యేక తరగతుల నిర్వహణకు ప్రత్యేకంగా సమయాన్ని నిర్ధారించినట్లు తెలిపారు. సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులకు హాజరై మంచి విద్యను పొందాలని హితవు పలికారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో మౌలిక సదుపాయాలు

పార్వతీపురం రూరల్: అంగన్వాడీ కేంద్రాలలో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరుచేసిందని సీడీపీఓ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని డి.ములగ, మడకవానివలస, కె.ములగ, పిండిలోవ, బిల్లగుడ్డివలస, వెలగవలస, సంగంవలస, పెదబొండపల్లి తదితర గ్రామాల్లో జరుగుతున్న పనులను, కేంద్రాల నిర్వహణను, తరగతుల్లో విద్యార్థులకు బోధిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాలలో తాగునీరు, మరుగుదొడ్లు, భవనాలకు పెయింటింగ్‌లు తదితర పనులకు సంబంధించి పురోగతిని పరిశీలించారు. దీనికి సంబంధించి ప్రభుత్వం నిధులను మంజూరుచేసిందని చెప్పారు. మండలంలోని 40 మరుగుదొడ్లు మంజూరు కాగా ఒక్కోదాని నిర్మాణానికి రూ.36 వేలు, 42 అంగన్వాడీ కేంద్రాలకు తాగునీటిని కల్పించేందుకు, ఇంకుడు గుంతుల నిర్మాణానికి ఒక్కో అంగన్వాడీ కేంద్రానికి రూ.32వేలు మంజూరు చేసినట్లు తెలిపారు. మరో 22 అంగన్వాడీ కేంద్రాలకు ప్రహరీల నిర్మాణానికి ఉపాధిహామీ నిధులు మంజూరుచేశారన్నారు. అంగన్వాడీలలో నిర్వహిస్తున్న పనులు త్వరితగతిన పూర్తిచేసేలా కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు చెప్పారు.



చిన్నారుల బరువును పరిశీలిస్తున్న సీడీపీఓ శ్రీనివాసరావు

గర్భిణులు బలవర్ధక ఆహారం తీసుకోవాలి

- డాక్టర్ సుజాత

సాలూరు రూరల్: గర్భిణులు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని లేదంటే రక్తహీనతకు గురికావాల్సి ఉంటుందని తోణాం డాక్టర్ సుజాత సూచించారు. ఈ మేరకు సోమవారం కురుకూటి హెల్త్ సెంటర్‌లో ఆమె గర్భిణులు, పిల్లలకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చిన పేషెంట్లు, గర్భిణులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గర్భిణుల్లో రక్తహీనత రాకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఎప్పటికప్పుడు గర్భిణుల వివరాలు తీసుకుని పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వారిలో క్షీణత ఉంటే వెంటనే కేంద్రాస్పత్రికి పంపించి అవసరమైన వారికి రక్తం ఎక్కించే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే పిల్లలో స్కిన్ ఎలర్జీ వచ్చిన వారికి పరీక్షలు చేసి అవసరమైన ట్రీట్‌మెంట్ ఇస్తున్నామన్నారు. ఇంకా జిల్లా కేంద్రాస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా తగిన ట్రీట్‌మెంట్ ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



స్కిన్ ఎలర్జీ వచ్చిన చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ సుజాత

స్టడీ మెటీరియల్ పంపిణీ

పాచిపెంట: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినులకు ఎంపీడీవో బీవీజే పాత్రో సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. గతంలో ఎంపీపీ బి.ప్రమీల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థినులకు ఉచితంగా మండల ప్రజా పరిషత్ నుంచి స్టడీ మెటీరియల్ అందజేస్తామని చెప్పారని, నేడు వాటిని పంపిణీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ మల్లేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంపీడీవో బీవీజే పాత్రో

ఏజెన్సీలో తగ్గిన చింతపంట



చింతచెట్టు పూతరాకపోవడంతో చెట్టుకింద కూర్చుని విచారిస్తున్న గిరిజన మహిళ

సాలూరు రూరల్: మండలంలోని ఏజెన్సీ ప్రాంత గిరిజనులు దాదాపు చింతపండు అమ్మకంతోనే జీవనోపాధి సాగిస్తుంటారు. ఏటా జీసీసీ గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఎప్పటికప్పుడు ధర పెంచుతూ వస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది కూడా రెండు రూపాయలు ధర పెంచి కిలో రూ.36కు కొనుగోలు చేసేందుకు జీసీసీ ధర నిర్ణయించింది. అలాగే జీసీసీ అధికారులు, సిబ్బంది గిరిజనులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ దళారుల చేతిలో మోసపోవద్దని ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నారు. అయితే ఈ ఏడాది అంతా బాగుందనుకున్న తరుణంలో ఏజెన్సీలో చింత చెట్టు పూత సరిగా లేకపోవడంతో గిరిజనుల ఆదాయంపై నీళ్లు చల్లినట్లయింది. ఇటీవల కురిసిన వర్షాలు కొంత వరకు చింతపండు దిగుబడిపై ప్రభావం చూపాయని గిరిజనులు చెబుతున్నారు. అంతేకాకుండా దశాబ్దాలుగా ఏజెన్సీలో చింతచెట్లు కాపునిస్తూ గిరిజనులను ఆదుకున్నాయని ప్రస్తుతం వాటి వయసు మీరడంతో చాలావరకు చెట్లు కాపు తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే మరికొన్నేళ్లలో చింత చెట్లు వయసు ముదిరి పూర్తిగా ఆదాయ వనరులకు గండిపడే ప్రమాదం ఉందంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏజెన్సీ గిరిజనులకు ఆదాయ వనరు అయిన చింతచెట్లు పెంపకంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు. అలాగే ఈ ఏడాది గిరిజనులను సంక్షేమం ద్వారా ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చింతపండు దిగుబడి తగ్గుతుంది



ఈ ఏడాది చింతపండు దిగుబడి తగ్గుతుంది. ఇటీవల కురిసిన వర్షాలు కొంత కారణం. అలాగే ఏజెన్సీలో చింత చెట్లు చాలావరకు వయసుమీరాయి. చెట్ల వయసు అయిపోయిన కారణంగా పంట దిగుబడి తగ్గుతుంది. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించి తగుచర్యలు తీసుకోవాలి

– వంతల కాంద్ర పనుకులోవ, సాలూరు మండలం